మన సమగ్ర
ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
ప్రజావాణి
ఎప్పటి వార్తలు
అప్పుడే...
5 PM
తెలుగు డైలీ
శుక్రవారం, 06, నవంబర్ , 2026
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY
https://epaper.prajavaani.net

తెలంగాణ సీఐడీ చేతికి
సరికొత్త అస్త్రం

హైదరాబాద్ :అత్యాధునిక టెక్నాలజీ వినియోగంలో ముందుంటున్న తెలంగాణ పోలీసుల చేతిలో మరో అధునాతన నేర పరిశోధన అస్త్రం వచ్చి చేరింది. ఫేస్ రికగ్నిషన్‌లో కీలకమైన అంబిస్ మొబైల్ ఫేస్ సెర్చ్ టూల్‌ను తాజాగా సమకూర్చుకున్నారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే దర్యాప్తు అధికారులు ఈ సెర్చ్‌టూల్‌ను వినియోగి ంచే సదుపాయం గురువారం నుంచి అందుబాటులోకి వచ్చింది.పాత నేరస్థులు, అనుమానితుల గుర్తింపులో ఈ అంబిస్ మొబైల్ ఫేస్ సెర్చ్ టూల్ కీలకం కానుంది. ఉదాహ రణకు జన సమర్థం ఎక్కువగా ఉండే ప్రాం తంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా సంచరి స్తుండటం అక్కడే ఉన్న ఓ పోలీస్ అధికారి కంటపడింది. అతడు కరడుగట్టిన పాత నేరస్థు డనే అనుమానంతో వెంటనే అతడి ఫొటో తీసి దాన్ని తన స్మార్ట్‌ఫోన్ ఉన్న ఓ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. 15 సెకన్లలోనే అతడి క్రైమ్ హిస్టరీ సెల్‌ఫోన్ తెరపై ప్రత్యక్షమైంది. ఇంటర్? స్టేట్ నేరస్థుడైన అతడిపై గతంలో 10 కేసులతో పాటు నాన్ బెయిలబుల్ వారంట్లు పెండింగ్‌లో ఉన్నట్లుగా పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించడంతో భారీ చోరీకి పథకం రచించి హైదరాబాద్ నగరం వచ్చినట్లు తేలింది. ఈ సరికొత్త టూల్? ఇలాంటి నేరాలు ఎన్నింటినో కట్టడి చేసేందుకు పోలీసులకు ఉపకరిస్తుంది.తెలంగాణ సీఐడీ డేటాబేస్‌లో ఉన్న దాదాపు 9.8 లక్షల మంది పాత నేరస్థుల ముఖాలతో పాటు నేర రికార్డులను ఈ టూల్ ద్వారా అనుసంధానించారు.

తెలంగాణ కాంగ్రెస్‌లో రాజుకున్న వర్గపోరు
– జోక్‌గా మారిన క్రమశిక్షణ.

- సీఎం, పీసీసీ చీఫ్ కంట్రోల్ చేయలేకపోతున్నారా?
- తిరుగుబాటు చేస్తున్న మంత్రులు
- మంత్రులు, ఎమ్మెల్యేల మధ్యనా సమస్యలు

హైదరాబాద్ : తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడేళ్లు అయినా అధికార పక్షంలో క్రమశిక్షణ అనేది ఒక పెద్ద జోక్‌గా మారిందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. విపక్షాలను దెబ్బతీయడం దేవుడెరుగు, సొంత ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలే బహిరంగ వేదికలపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను, ప్రభుత్వ విధానాలను ఎండగడుతుంటే టీపీసీసీ నాయకత్వం చేష్టలుడిగి చూస్తోంది. జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వంటి నేతలు నేరుగా ముఖ్యమంత్రి వైఖరిపైనే కామెంట్లు చేస్తుంటే, జిల్లాల స్థాయి నేతల మధ్య గొడవలు రోడ్డెక్కుతున్నాయి. ప్రభుత్వం నడుపుతున్న వేళ ఈ స్థాయిలో అంతర్గత విభేదాలు రచ్చకెక్కడం పార్టీ క్యాడర్‌లో తీవ్ర నిరాశను నింపుతోంది. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి పార్టీలో నిధులతో పాటు పదవుల విషయంలో పాతకాపులకు విలువేదీ, కొత్తగా వచ్చిన వారికే పదవులు దక్కుతున్నాయి అంటూ చేసిన సంచలన వ్యాఖ్యలు గాంధీభవన్‌లో పెద్ద ప్రకంపనలే సృష్టించాయి. దానికి తోడు జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఏకంగా సీనియర్ల వ్యాఖ్యలకు మద్దతు తెలపడమే కాకుండా, తన నియోజకవర్గానికి నిధులు ఇవ్వకుంటే ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని సొంత ప్రభుత్వంపైనే తిరుగుబాటా తరహా హెచ్చరికలు



జారీ చేశారు. వీరికి తోడుగా ఇతర ప్రజాప్రతినిధులు కూడా అసెంబ్లీ లోపలా, బయటా మంత్రులను, నిర్ణయాలను ప్రశ్నిస్తుండటంతో అధికార కాంగ్రెస్‌లో విపరీతమైన ఆధిపత్య పోరు సాగుతోందనేది స్పష్టమవుతోంది.జిల్లాలలో కూడా మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య ఆధిపత్య పోరు సరిహద్దులు దాటిపోతోంది. తాజాగా ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు మధ్య ఢిల్లీ హోటల్ వేదికగా జరిగిన ఘర్షణ కాంగ్రెస్ శ్రేణులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. నామినేటెడ్ పదవులు, జిల్లా పార్టీ అధ్యక్షుల ఎంపిక, ప్రాంతీయ ఆధిపత్యం విషయంలో వీరిద్దరి మధ్య మాటల యుద్ధం జరిగి, అది భౌతిక తీవ్రత స్థాయికి చేరుకుందన్న వార్తలు గాంధీభవన్‌ను ముంచెత్తాయి. ప్రగతి భవన్ లేదా గాంధీభవన్‌లో పరిష్కరించుకోవాల్సిన అంతర్గత విభేదాలను ఏకంగా హస్తిన వీధుల్లో రచ్చకెక్కించడం ద్వారా నేతలు పార్టీకి ఎంతటి పరాభవాన్ని మిగిల్చారో వేరే చెప్పక్కర్లేదు.ఈ విపరీత పరిణామాలకు ప్రధాన కారణం టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ , రాష్ట్ర నాయకత్వం పూర్తిగా వైఫల్య ం చెందడమే. క్రమశిక్షణా రాహిత్యానికి పాల్పడిన కఠిన చర్యలు తీసుకోవడంలో పార్టీ సుముఖత చూపకపోవడం వల్లనే నేతలకు భయం లేకుండా పోయింది. గతంలో కొందరు చిన్న స్థాయి నేతలకు లేదా బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులకు నోటీసులు ఇచ్చిన కమిటీ, ఎంపీలు, బలమైన ఎమ్మెల్యేలు మరియు మంత్రుల విషయంలో మాత్రం మౌనం వహించడమో లేదా శోకాన్ని నటిస్తూ సమన్వయ కమిటీల పేరుతో కాలయాపన చేయడమో చేస్తోంది. ఈ ద్వంద్వ నీతి వల్లే క్రమశిక్షణ కమిటీ ఉనికి నవ్వులపాలవుతోంది. కాంగ్రెస్ పార్టీకి మొదటి నుంచీ ఉన్న తనదైన మార్క్ ప్రజాస్వామ్యం , ఢిల్లీ కల్చర్ కూడా ఈ రచ్చకు మరొక బలమైన కారణం.

హైదరాబాద్‌లో కల్తీ పాల తయారీ గుట్టురట్టు..
100 లీటర్ల సీజ్



హైదరాబాద్, నవంబర్ 6: భాగ్యనగరంలో కల్తీ పాల తయారీ కలకలం రేపుతోంది. కల్తీ పాలను తయారు చేస్తున్నట్లు పక్కా సమాచారంతో సదరు కేంద్రంపై ఎస్‌వోటీ పోలీసులు దాడులు నిర్వహించారు. ఇబ్రహీం పట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని పోచారం గ్రామంలో కల్తీ పాల తయారీ కేంద్రంపై ఎస్‌వోటీ మహేశ్వరం జోన్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. హైడ్రోజన్ పెరాక్సైడ్, ధోల్‌పూర్ పాలపొడిని కలిపి కల్తీ పాలు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. అంతేకాకుం డా ఇలా తయారు చేసిన కల్తీ పాలను హైదరాబాద్‌లోని వినియోగదారులకు సరఫరా చేస్తున్నట్లు అధికారుల దాడుల్లో బయటపడింది. కల్తీ పాల తయారీ, సరఫరా చేస్తున్న ఆండే శ్రీశైలంను(43) నూ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు శ్రీశైలం.. పోచారం గ్రామంలో నివాసం ఉంటూ పాల వ్యాపారం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఈ క్రమంలో100 లీటర్ల కల్తీ పాలతో పాటు1 లీటర్ హైడ్రోజన్ పెరాక్సైడ్, ధోల్‌పూర్ పాలపొడి ప్యాకెట్లు 35(ఒక్కోటి కిలో) అధికారులు సీజ్ చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కల్తీ పాలను తయారు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే వారి పట్ల కఠిన చర్యలు తప్పని పోలీసులు హెచ్చరించారు.

ఎమ్మెల్సీ పోరులో తెలంగాణ బీజేపీ చీఫ్
రామచంద్రరావు బిగ్ రిస్క్

హైదరాబాద్: తెలంగాణ రాజకీయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల వేడి తారస్థాయికి చేరింది. హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు స్వయంగా రంగంలోకి దిగాలని భావించడం, దానికి అధిష్ఠానం ఆమోద ముద్ర వేయడం ఇప్పుడు కమలదళంలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. త్వరలో అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది. గతంలో ఇదే స్థానం నుంచి ఎమ్మెల్సీగా గెలిచిన అనుభవం రామచం ద్రరావుకు ఉన్నప్పటికీ, రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో ఉండి మళ్లీ ఈ ఎన్నికల్లో పోటీ చేయడం అత్యం త ప్రమాదకరమైన పొలిటికల్ రిస్క్ అనడంలో ఎలాంటి సందేహం లేదు.సాధారణంగా ఏ రాజకీయ పార్టీలోనైనా రాష్ట్ర అధ్యక్షుడు యావత్ రాష్ట్రంపై దృష్టి సారించి పార్టీని విజయతీరాలకు చేర్చాలి తప్ప, స్వయంగా ఒక నియోజకవర్గానికే పరిమితమై ప్రచారం చేసుకోవడం అరుదు. ఒకవేళ పట్టభద్రుల పోరులో ఫలితం తేడా వస్తే, వచ్చే మొదటి సవాలు రామచంద్రరావు నాయకత్వంపైనే. గ్రాడ్యుయేట్లు, విద్యావంతులు ఎక్కువగా ఉండే ఈ నియోజకవర్గంలో ఓటమి ఎదురైతే రాష్ట్ర అధ్యక్షుడిగా ఆయన తన పదవికి



రాజీనామా చేయాల్సిన నైతిక బాధ్యత ఏర్పడుతు ంది. ఈ విషయం తెలిసి కూడా ఆయన పోటీకి దిగుతున్నారా లేదా హైకమాండ్ ఆయనను ఈ రిస్కులోకి నెట్టిందా అనే సందేహాలు పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ పాలన, రేవంత్ రెడ్డి సర్కార్ వైఫల్యాలపై దాడి చేయాల్సిన కీలక సమయంలో, రాష్ట్ర అధ్యక్షుడు ఒకే నియోజకవర్గంలో డివిజన్ల వారీగా తిరగడం బీజేపీ ప్రచార వేగానికి ఆటంకం కలిగిస్తుందనే ఆందోళన ఉంది. అయితే, రామచంద్రరావు వర్గం మాత్రం దీనిని విశ్వాస ప్రకటన గా చూస్తోంది. పట్టభద్రుల్లో బీజేపీకి ఉన్న తిరుగులేని ఇమేజ్‌ను, సీనియర్ న్యాయవాదిగా తనకున్న గుర్తింపును నమ్ముకుని, ఓటమి భయాన్ని పక్కనపెట్టి ఫ్రంట్ ఫుట్‌లో పోరాడుతు న్నట్లు కలరింగ్ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

తెలంగాణలో ఆర్ఆర్
ట్యాక్స్ దందా.

హైదరాబాద్:తెలంగాణ రాజకీయాల్లో 'ఆర్ఆర్ ట్యాక్స్' వ్యవ హారం మరోసారి తీవ్ర దుమారం రేపుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం బిల్డర్ల నుంచి స్క్వేర్ ఫీట్‌కు రూ.200 చొప్పున ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా విమర్శలు చేశారు. హైదరాబాద్‌లో ఏ బిల్డర్‌ను లేదా డెవలపర్‌ను అడిగినా ఈ ట్యాక్స్ నిజమని చెప్తారన్నారు. అమిత్ షా విమర్శలపై కేటీఆర్ కౌంటర్ ఇటీవల తెలంగాణలో పర్యటించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా ప్రధాని మోదీ కూడా సీఎం రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీలు ఆర్ఆర్ ట్యాక్స్ పేరుతో కోట్లాది రూపాయలు దోచుకుంటున్నారని పదేపదే ఆరోపించారు. అయితే, కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కేవలం పెద్ద పెద్ద మాటలు చెప్పడమే తప్ప, ఈ వ్యవహారంపై ఎలాంటి చర్యలూ తీసుకోదని కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు విసిరారు.బడా భాయ్ మోదీ, హోంమంత్రి అమిత్ షాలు తరచూ హైదరాబాద్ వచ్చి రేవంత్, రాహుల్‌లపై ఆరోపణలు చేస్తారు.



కానీ నా మాటలు గుర్తుపెట్టుకోండి.. ఈ ఆర్ఆర్ ట్యాక్స్‌పై ఎలాంటి చర్యలు ఉండవు. ఎందుకంటే బడా భాయ్ (మోదీ) తన ఏబీవీపీ ఛోటా భాయ్ (రేవంత్ రెడ్డి) పై ఎప్పటికీ చర్యలు తీసుకోరు" అని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూనే, బీజేపీ–కాంగ్రెస్ మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందనే కోణంలో కేటీఆర్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

కామారెడ్డి జిల్లాలో ఫార్మా కంపెనీలో
భారీ ప్రమాదం.

రియాక్టర్ పేలుడుతో ఐదుగురికి తీవ్ర గాయాలు!

కామారెడ్డి, నవంబర్ 6: జిల్లాలో పారిశ్రామిక ప్రమాదం కలకలం రేపింది. భిక్కనూరు శివారులో ఉన్న ఎంఎస్ఆర్ ఫార్మా కంపెనీలో రియాక్టర్ ఒక్కసారిగా పేలడంతో భారీ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో కంపెనీలో పనిచేస్తున్న ఐదుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. పేలుడు ధాటికి కార్మికులు గాయపడటంతో కంపెనీ ప్రాంగణంలో ఆందోళనకర పరిస్థితి నెలకొంది. ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన సిబ్బంది క్షతగాత్రులను బయటకు తీసుకొచ్చి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. గాయపడిన ఐదుగురిలో ముగ్గురు ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు కాగా, మరో ఇద్దరు స్థానికులుగా గుర్తించారు.క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు వైద్యులు, అధికారులు వారిని హైదరాబాద్‌కు తరలించారు. అయితే.. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనతో కార్మికుల భద్రత, ఫార్మా కంపెనీల్లో ప్రమాదాల నివారణ చర్యలపై మరోసారి చర్చ మొదలైంది. అసలు రియాక్టర్ ఎందుకు పేలింది? సాంకేతిక లోపం ఏదైనా ఉందా? లేక భద్రతా ప్రమాణాల అమలులో నిర్లక్ష్యం జరిగిందా? అనే కోణాల్లో



పోలీసులు విచారణ చేపట్టారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలను గుర్తించేందుకు అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

మెట్రో–ఆర్టీసీ ఉమ్మడి ప్రయాణ
పాస్ ధరల్లో భారీ తగ్గింపు

- నెలవారీ కామన్ పాస్ ధర రూ.8,500 నుంచి రూ.4,000కి తగ్గింపు
- రోజువారీ పాస్ ధరను రూ.400 నుంచి రూ.275కి తగ్గించిన సర్కార్
- దీపావళి కానుక ఈ నెల 8 నుంచి అమలులోకి రానున్న కొత్త ధరలు

హైదరాబాద్ నగరవాసులకు తెలంగాణ ప్రభుత్వం దీపావళి కానుక ప్రకటించింది. మెట్రో రైలు, టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు ఉద్దేశించిన కామన్ పాస్ ధరలను భారీగా తగ్గిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త ధరలు నవంబర్ 8 నుంచి అమలులోకి రానున్నాయి.తాజా నిర్ణయంతో గతంలో రూ. 8,500గా ఉన్న నెలవారీ కామన్ పాస్ ధర ఇప్పుడు రూ. 4,000కి తగ్గింది. ఇందులో రూ. 3,000 మెట్రోకు, రూ. 1,000 టీజీఎస్ఆర్టీసీకి కేటాయించారు. ఈ పాస్‌తో



నెలలో 50 రౌండ్ ట్రిప్పులు చేసేందుకు అవకాశం ఉంటుంది. అదేవిధంగా రూ. 400గా ఉన్న రోజువారీ పాస్ ధరను రూ. 275కి తగ్గించారు. ఇందులో రూ. 200 మెట్రోకు, రూ. 75 ఆర్టీసీకి చెల్లించాల్సి ఉంటుంది. ఈ పాస్‌పై రోజుకు నాలుగు సింగిల్ జర్నీలకు అనుమతి ఉంటుంది.మఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ ధరలను సవరించినట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నిత్య ప్రయాణికులపై ఆర్థిక భారాన్ని తగ్గించడంతో పాటు ప్రజలు ఎక్కువగా ప్రజా రవాణాను వినియోగించేలా ప్రోత్సహించడమే తమ లక్ష్యమని ఆయన వివరించారు.కాగా, మెట్రో, ఆర్టీసీ ప్రయాణాల కోసం ఒకే కార్డును వినియోగించే ఈ కామన్ పాస్‌ను అక్టోబర్ ప్రారంభంలో ప్రవేశపెట్టారు. అయితే, అప్పట్లో నిర్ణయించిన ధరలు చాలా ఎక్కువగా ఉన్నాయని ప్రయాణికుల నుంచి విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ధరలను తగ్గిస్తూ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం.. పట్టాలు అందని వారికి మరోసారి విచారణ చేపట్టి పట్టాలు అందిస్తాం: ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

చేగుంటలో 2దీనఖ ఇళ్ల పట్టాలు, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చేగుంట: చేగుంట మండల కేంద్రంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి గారు లబ్ధిదారులకు 2దీనఖ ఇళ్ల పట్టాలు, కల్యాణలక్ష్మి పథకం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి గారు మాట్లాడుతూ.. పేదలకు సొంతింటి కలను నిజం చేయాలనే లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ గారు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టి వేలాది నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేశారని అన్నారు. అలాగే ఆడపిల్లల వివాహం తల్లిదండ్రులకు ఆర్థిక భారం కాకూడదనే ఉద్దేశంతో కల్యాణలక్ష్మి పథకాన్ని అమలు చేసి లక్షలాది కుటుంబాలకు అండగా నిలిచారని గుర్తుచేశారు. ప్రస్తుతం కొంతమంది లబ్ధిదారులకు పట్టాలు అందని పరిస్థితి ఉందని, దీనిపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. మరోసారి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తామని తెలిపారు. గతంలో అవగాహన లోపం వల్ల లేదా ఇతర కారణాలతో పట్టాలు పొందని వారికి కూడా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, నిజమైన అర్హులైన ప్రతి ఒక్కరికీ పట్టా సర్టిఫికెట్లు అందించే బాధ్యత తీసుకుంటామని స్పష్టం చేశారు.పేదలకు ఇళ్లు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే.. ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పించిన ఘనత కేసీఆర్ గారిదే. సంక్షేమ పథకాలు రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలన్నదే తమ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడమే ప్రజాప్రతినిధుల బాధ్యత అని, ఎవరికి అన్యాయం జరిగినా వారి పక్షాన నిలబడి పోరాడుతామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విద్యార్థులపై అదనపు ఫీజుల భారం మోపడం ఏమిటి

- **పరీక్ష ఫీజు కట్టాలంటే రూ.10 వేలు, రూ.30 వేలు చెల్లించాలా**
- **ఒంగోలు ఇందిరా ప్రియదర్శిని లా కాలేజీ యాజమాన్యంపై విచారణ జరపాలి**
- **తన్నీరు విజయ్ డిమాండ్**



ప్రజావాణి దినపత్రిక ప్రకాశం జిల్లా బ్యూరో నవంబర్ 5

ప్రభుత్వ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా న్యాయ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల పట్ల ఒంగోలులోని ఇందిరా ప్రియదర్శిని లా కాలేజీ యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరుపై విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.విద్యార్థుల ఆరోపణల ప్రకారం, కాలేజీ ఫీజు కింద రూ.30,000 చెల్లించాలని, లేదంటే కనీసం రూ.10,000 అయినా చెల్లిస్తేనే పరీక్ష ఫీజు కట్టించుకుంటామని యాజమాన్యం ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈరోజే పరీక్ష ఫీజు చెల్లించడానికి చివరి తేదీ కావడంతో విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఫీజులు చెల్లించలేని విద్యార్థులు పరీక్షలకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడటం ఆందోళనకరం.ప్రభుత్వం విద్యార్థుల ఉన్నత విద్యకు ఆర్థిక సహాయం అందించేందుకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేస్తుంటే, మరోవైపు అదనపు మొత్తాలు చెల్లిస్తేనే పరీక్ష ఫీజులు చెల్లించుకునే అవకాశం కల్పిస్తామనే ఒత్తిడి నిజమైతే దీనిపై అధికారులు తక్షణమే స్పందించాలి.విద్య అనేది వ్యాపార వస్తువు కాదు. విద్యార్థుల ఆర్థిక పరిస్థితిని ఆసరాగా చేసుకుని వారి పరీక్షల అవకాశాలను అడ్డుకునే పరిస్థితి ఉండకూడదు.జిల్లా కలెక్టర్, ఉన్నత విద్యాశాఖ అధికారులు, సంబంధిత విశ్వవిద్యాలయ అధికారులు వెంటనే జోక్యం చేసుకుని ఆరోపణలపై విచారణ జరపాలని, విద్యార్థులందరికీ ఎలాంటి అదనపు ఒత్తిడి లేకుండా పరీక్ష ఫీజులు చెల్లించే అవకాశం కల్పించాలని తన్నీరు విజయ్ డిమాండ్ చేశారు.ఒక్క విద్యార్థి కూడా ఆర్థిక ఇబ్బందుల కారణంగా పరీక్షకు దూరం కాకూడదు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు విద్యాసంస్థలపై కూడా ఉంద తన్నీరు విజయ్చారాల నియోజకవర్గం ఇన్చార్జ్ రిఫార్మ్ పార్టీ ఆఫ్ ఇండియా ఈ సమావేశంలో తెలిపారు.

శాలపల్లి అభివృద్ధికి మరో ముందడుగు.. మహిళల సౌకర్యార్థం రెండు మరుగుదొడ్ల నిర్మాణ పనులు ప్రారంభం!



వేలేరు మండలం, నవంబర్ 06:

గ్రామీణ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, మహిళలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా శాలపల్లి గ్రామంలో మరో అభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.ఇటీవలే ప్రారంభోత్సవం జరుపుకున్న మహిళా భవనం ఆవరణలో సాదీవీ గ్రాంట్ పథకం నిధులతో రెండు మరుగుదొడ్ల నిర్మాణ పనులను శుక్రవారం గ్రామ సర్పంచ్ కూరపాటి అశోక్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసిన వీఆర్ఏ కిషన్ నాయక్, వీఆర్ఏ బుచ్చిరెడ్డితో కలిసి సర్పంచ్ కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కూరపాటి అశోక్ మాట్లాడుతూ.. మహిళలకు గతంలో ఇచ్చిన హామీ మేరకు ఈ మరుగుదొడ్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. మహిళల గౌరవం, ఆత్మగౌరవం, సౌకర్యాలకు పెద్దపీట వేస్తూ గ్రామంలో మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. కార్యక్రమానికి విచ్చేసిన వీఆర్ఏ, వీఆర్ఏ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎర్రగొల్ల రమేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు పోతారబోయిన సతీష్, వార్డు సభ్యులు దేవరాజు, వెంకటేష్, గ్రామ కార్యదర్శి విజయ్, మహిళా సంఘాల అధ్యక్షురాలు మండల లావణ్య, జూా స్వరూప, కార్యదర్శి స్వరూప, మహిళా సంఘాల సభ్యులు, ఖీూ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

సాహితీ లోకంలో స్వప్నకు సరికొత్త గుర్తింపు.. ఘనంగా "స్వప్నాంకురం" పద్య శతకం ఆవిష్కరణ!

తెలుగు సాహిత్యానికి యువ రచయిత్రి అందించిన అద్భుత కానుక.. మానవీయ విలువలకు అక్షర రూపం



కూకట్‌పల్లి, నవంబర్ 6 (ప్రజావాణి):

తెలుగు సాహితీ రంగంలో యువ రచయిత్రిగా తనదైన ముద్ర వేస్తున్న వేముల స్వప్న రచించిన "స్వప్నాంకురం" పద్య శతకం ఘనంగా ఆవిష్కృతమైంది. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో గురువారం నిర్వహించిన ఈ ఆవిష్కరణ మహోత్సవం సాహితీ అభిమానుల సమక్షంలో వైభవంగా జరిగింది.విశ్వవిద్యాలయంలోని జి.వి. సుబ్రహ్మణ్యం ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తెలుగు శాఖాధిపతి ఆచార్య కె. రత్నశ్రీ ముఖ్య అతిథిగా హాజరై శతకాన్ని ఆవిష్కరించారు. ఆచార్య కాచనపల్లి గోవర్ధన రాజు సభాధ్యక్షత వహించగా, ఆచార్య డాక్టర్ చందోజీ రావు పుస్తక సమీక్షకుడిగా వ్యవహరించారు. తెలుగు శాఖ అధ్యాపకురాలు డాక్టర్ సరస్వతి రచయిత్రిని ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. "స్వప్నాంకురం" పద్య శతకం సమాజంలోని వివిన్న అంశాలను, మానవ సంబంధాలను, నైతిక విలువలను తనదైన కవితా శైలిలో ఆవిష్కరించిందని ప్రశంసించారు. విద్యార్థి దశలోనే పద్య రచనపై ఆసక్తి పెంచుకొని శతకాన్ని వెలువరించడం అభినందనీయమని పేర్కొన్నారు. యువతలో సాహిత్య అభిరుచిని పెంపొందించేందుకు ఇలాంటి రచనలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని అన్నారు.అనంతరం రచయిత్రి వేముల స్వప్న మాట్లాడుతూ తన రచనా ప్రయాణానికి ప్రేరణగా నిలిచిన ఆలోచనలు, అనుభవాలు, స్ఫూర్తిని సభికులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కవులు, రచయితలు, పరిశోధకులు, విద్యార్థులు, భాషాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని యువ రచయిత్రి వేముల స్వప్నకు అభినందనలు తెలియజేశారు. "స్వప్నాంకురం" ఆవిష్కరణతో తెలుగు సాహితీ ప్రపంచంలో మరో యువ కలం తన ప్రయాణాన్ని ఘనంగా ప్రారంభించింది.

వేములలక్ష్మణ్ .గౌడ్.మృతితీరనిలోటు కుటుంబానికిటీయుఎఫ్.నాయకుల ప్రగాఢసానుభూతి

- **లక్ష్మణ్ కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలిభార్య స్వప్నకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి**
- **టీ యు ఎఫ్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ జిల్లా అధ్యక్షుడు ఎక్కటి సంజీవరెడ్డి**



జమ్మికుంట నవంబర్ 5 (ప్రజావాణి)

1200 మంది అమరవీరుల త్యాగాలతో ఏర్పడిన తెలంగాణలో ఉద్యమకారులకు అన్యాయంఇళ్ల స్థలాలు హెల్త్ కార్డులు అందించాలికన్నీటి పర్యంతమైన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన నాయకులుకష్టకాలంలో అండగాఉంటామనిభరోసాజన గామ జిల్లా బచ్చన్నపేట మండలం కొన్నే గ్రామంలో కీర్తిశేషులు వేముల లక్ష్మణ్ గౌడ్ కుటుంబాన్ని తెలంగాణ ఉద్యమకారుల



ఫోరం (టీ యు ఎఫ్)నాయకులుపరామర్శించారు లక్ష్మణ్ గౌడ్ తండ్రి మల్లయ్య గౌడ్‌ను కలిసి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు లక్ష్మణ్ గౌడ్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతివిచారం వ్యక్తం చేస్తూ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారుఈ సందర్భంగా టీ యు ఎఫ్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ జిల్లా అధ్యక్షుడు ఎక్కటిసంజీవరెడ్డిమాట్లాడుతూవేముల లక్ష్మణ్ గౌడ్ మృతి ఆ కుటుంబానికి తీరని లోటని, కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉండాల్సిన వ్యక్తిని కోల్పోవడం ఎంతో బాధాకరమని అన్నారు. ఆయన మృతితో కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న వేదనను మాటల్లో వర్ణించలేమని ఆవేదన వ్యక్తం చేశారు. లక్ష్మణ్ గౌడ్ 2006 నుండి తెలంగాణ సాధన కొరకు అలుపెరుగని పోరాటం చేశారు అలాంటి వ్యక్తి ఇలా ఆత్మ హత్య చేసుకోవడం బాధాకరం ఇలాంటి విషాద సమయంలో బాధిత కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారుతెలంగాణ రాష్ట్ర సాధన కోసం 1200 మంది అమరవీరులు చేసిన ప్రాణత్యాగాల ఫలితంగా ఏర్పడిన ప్రత్యేక తెలంగాణలో ఉద్యమకారులకు ఆశించిన గుర్తింపుగౌరవంలభించకపోవడం బాధాకరమని సంజీవరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు తెలంగాణ కోసం తమ జీవితాలను కుటుంబాలను సైతం పక్కనపెట్టి పోరాడిన అసలైన ఉద్యమకారులకు గత ప్రభుత్వం గానీ ప్రస్తుత ప్రభుత్వం గానీ సరైన న్యాయం చేయలేకపోయాయని విమర్శించారుఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని అర్హులైన ఉద్యమకారులందరికీ ఇళ్ల స్థలాలు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారుఉద్యమకారుల త్యాగాలను గుర్తించి వారికి గౌరవప్రదమైన జీవితం కల్పించాలనికోరారుఅదేవిధంగా వేముల లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు ఆయన భార్య స్వప్నకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించి కుటుంబానికి జీవన భరోసా కల్పించాలని కోరారు. కేవలం సానుభూతి ప్రకటనలకే పరిమితం కాకుండా బాధిత కుటుంబానికి ఆచరణాత్మకంగా న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారుటీ యు ఎఫ్ ఫౌండర్ డాక్టర్ చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ ఒక కుటుంబంలో ఆత్మీయుడిని కోల్పోవడం మాటల్లో చెప్పలేని విషాదమని అన్నారు. లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి కలిగిన నష్టాన్ని ఎవరూ పూడ్చలేరని, ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు మల్లయ్య గౌడ్‌తో పాటు కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, లక్ష్మణ్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం తరఫున బాధిత కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారుఈ పరామర్శ కార్యక్రమం లో పాల్గొన్న వారు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శ్యామల, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రజినీకాంత్. రాష్ట్రనాయకులు జోగుఅంజన్నదయానంద్.జిల్లాఅధ్యక్షుడురాజుహుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆరే రమేష్ రెడ్డి జమ్మికుంట టౌన్ అధ్యక్షులు మద్దూరి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

నల్గొండ మండలంలో విషాద ఘటన.. వ్యవసాయ పనులు చేస్తూ ప్రాణాలు కోల్పోయిన రైతు



నల్గొండ జిల్లా ప్రతినిధి ప్రజావాణినల్గొండ మండల పరిధిలోని నర్సింగ్ భట్ల గ్రామానికి చెందిన కానూగు (మొర్రి) లింగయ్య (50) వ్యవసాయ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి మృతి చెందాడు. కూతురుగూడెం గ్రామ పరిధిలో ఉన్న తన వ్యవసాయ భూమి వద్ద పొలం దున్నే పనిలో నిమగ్నమై ఉండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది.పొలం దున్నుతున్న సమయంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడటంతో లింగయ్యకు ప్రాణాంతక ప్రమాదం జరిగింది. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.వ్యవసాయ పనులు చేస్తూ రైతు ప్రాణాలు కోల్పోవడంతో నర్సింగ్ భట్ల, కూతురుగూడెం గ్రామాల్లో విషాదం నెలకొంది.

మార్కెట్‌లో పత్తి రైతులకుమంచి గిట్టుబాటు ధర అధికారుల చొరవతో

వ్యవసాయ మార్కెట్‌కు పత్తిని తీసుకొచ్చిన రైతులకు మార్కెట్ అధికారుల చొరవతో మంచి గిట్టుబాటు ధర లభించింది
మార్కెట్ చైర్పర్సన్ పూల్లూరి స్వప్న సదానందం



జమ్మికుంట నవంబర్ 5 (ప్రజావాణి)

కరీంనగర్ జిల్లా జమ్మికుంట పత్తి వ్యవసాయ మార్కెట్ కు 149 వాహనాలలో పత్తి తీసుకొచ్చిన రైతులు ప్రభుత్వం ధర 6667 రూపాయలు పత్తికి జమ్మికుంట మార్కెట్కు తీసుకువచ్చిన రైతన్నకి పత్తి తేమశాతం ఉండడం వల్ల కొనుగోలుదారులు ఖరీదుదారులు మిల్లర్లుతో రైతులకు గిట్టుబాటు ధర రావాలని ఉద్దేశంతో మార్కెట్ చైర్ పర్సన్. వైస్ చైర్మన్ డైరెక్టర్లు కార్యదర్శి బండి బండికి వెంబడి ఉండి రైతాంగానికి ధర వచ్చే విధంగా అనుకూలంగా ధరలు పెట్టించారు8800 రెండు మూడు బండలకు ఈ ధర పలకగా మిగతా వాహనాలకు 8600.8500 బండి బండికి తేడాలు చూసి ధరలు పెట్టించారు రైతులు కొంచెం సంతోషం వ్యక్తం చేశారు పండుగ దినం కాబట్టి మాకు ఖర్చులు ఉన్నాయి పెట్టుబడి పెట్టినాము మార్కెట్కు తీసుకొచ్చిన పత్తి కూలికి వచ్చిన వారు ఆగడం లేదని అందుకే ఎంతో కొంత ధరలకు అమ్ముకుంటున్నామని రైతులు ఆశించిన ధరలు9000 రావాల్సి ఉండగా వస్తదని అనుకొని ఇంటికాడీ నుంచి మార్కెట్కు తీసుకొచ్చినామని ఆయన ఈ ధర కూడా కొంచెం సంతోషం అనిపిస్తుందని రైతులు వ్యక్తం చేశారుకాలం సరిగా కాలేదని పంట కూడా సరిగా రాకపోయేసరికి వచ్చినప్పటికీ ఈ ధర అయినా రావడం చాలా సంతోషమని దగ్గరుండి ధరలు పెట్టించిన అధికారులకు సంతోషం వ్యక్తంచేశారుమార్కెట్ చైర్పర్సన్ పూల్లూరి స్వప్న సదానందం మాట్లాడుతూ రేపు శుక్రవారం ఒక్కరోజు మార్కెట్ మాత్రమే ఉంటదని మిగతా శనివారం ఆదివారం సోమవారం హాలిడేస్ అని మళ్ళీ మార్కెట్ మంగళవారం రోజున రైతులు మార్కెట్.పత్తిని ఆరబెట్టి మంచి ధర పొందాలని అన్నారు

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com